


[అన్నపూర్ణయైన మన భారతదేశం— నేడు భీకర ప్రళయ క్షామదేవతకు నిలయస్థానం అయిందీ అంటే, యెలా అయిందీ? స్వార్థపరులైన ధనవంతులీ దేశంలో నిరంకుశంగా, తోటి సోదరులను తిండికీ, బట్టకూ దూరంజేసి కాలిక్రింద పువ్వువలె నలిపి, యెంత హీనపరుస్తున్నారో యిందు చిత్రించియున్నది.]

●

అది ఊరిబయటనున్న యొక పూరిగుడిసె. ఆ యింట్లో ఎల్లప్పుడూ సూర్య చంద్రాదులు తాండవిస్తూవుంటారు. సగంయింటికప్పు ఎగిరిపోయిన ఆ పూరికొంప సగానికిపైగా క్రిందికి దిగజారిపోయిరిది. అది మనుష్యమాత్రుడు నివసించే కొంపకాదు...ప్రతీ దినం ఆదారిన షికారుకుపోయే నాకు ఆయింటిలోపలనుండి ఒక హీనస్వరం వినవస్తూవుంటుంది. మొదట అదేమో అనుకొన్నా. కానీ, ఆమూల్గు యిరువది నాలుగుగంటలూ వినవస్తూవుంటుందని నిలకడమీాద నికరంగా తెల్సుకొన్నా. నేనెప్పుడూ ఆమూల్గునే వింటూవుంటాను. ఆమూల్గునకు ఎప్పుడూ ఒక్క నిముషమైనా విరామం వుండదు. నాకుప్రతీదినమూ ఆశ్చర్యమే.

సాహసించి లోపలికివెళ్లిచూద్దామంటె ధైర్యంచాలదు. ధైర్యంమాట ఎటున్నా—బూర్జువా వర్గంతో పీడింపబడి, తోటి బానిస దరిద్రజీవుల ఆర్తనాదాలోకంలో విహరించుతూవున్నట్లుంది. ఆ నీరస హీనస్వరం. కూలీజీవుల ఎముకలరాపిడిచే, భవనాలలో సుఖభోగాలనుభవిస్తూవున్న ధనవంతులు—పొరపాటుననైనా, క్రుంగిపోయిన యీ కూలికొంపలవైపు కన్నెత్తి చూడని, ఆకర్కసుల హృదయాలు మానవ హృదయాలేనా?.........

ఓనాడు—ఏలా అయినా, ఆమూల్గు ఏమిటో—అసలు ఆకొంప వాతావరణం ఏమిటో తేల్చేసుకుందామని నిశ్చయించుకొన్నా. కానీ నా అవయవాలన్నీ కంపించిపోతున్నాయ్. శరీరం అంతా ముచ్చెమటలు పోసినాయ్. ముందుపడే అడుగు రెండడగులు వెనక్కు బడుతున్నాయ్. భయంతో హృదయం తడపడుతూంది... సాలిపురుగులకు విలాసమందిరం,—పిచ్చుకల అరపులకు, కాకి రెట్టలకు నిలయస్థానం; ఆ పూరిగుడిసె కళ్లకు కట్టినట్లుంది. వళ్లంతా ఒక్కసారిగా జలదరించింది. కానీ

నా మనోనిశ్చయాన్ని మాత్రం వదలిపెట్ట లేదు. గబగబా రెండడగులు ముందుకేసాను. ఎక్కడో హీనంగా వినబడే ఆమూల్గు, యిక్కడే చెవులను బ్రద్దలు చేసేటంత ఘోరంతో వినబడుతున్నట్లుంది. అసలు ఆమూల్గేమిటి? ఆమూల్గేది మనిషేనా? అట్లయితే మానవుడైన మనుష్యుడు ఆయింట్లో ఏలా వుండగలుగుతున్నాడు? ఆ స్వరం మనిషిది కాకపోతే మరేమిటి? అలాయిరువది నాలుగు గంటలూ విరామం లేకుండా మూల్గుతూం డేమిటి?... లేకపోతే, దేవలోకంలో నుంచి దేవతలు మూల్గేయంత్రాన్ని ఎవ్వరైనా తెచ్చి యిక్కడపెట్టి పోయారా?... ...అనే ప్రశ్నపరంపరలు కదుల్తూవున్న నా హృదయాన్ని ప్రశ్నిస్తున్నాయి. నాకేమీ బోధపడలేదు. నా అవయవాలు నా ఆధీనం తప్పాయి. నా బుఱ్ఱలో కొన్నివందల రైళ్లు పరువెత్తుచున్నట్లున్నాయి. వంటినిండా తేళ్లు, జెఱ్ఱులు ప్రాకుచున్నట్లున్నాయి. ఆఖరకు ఆపూరిగుడిసె చేరాను. మెల్లిగా. యింక అడుగుపడడంలేదు. ప్రయత్నించి చూసా. అబ్బే, లాభంలేకపోయింది. అలానే నిలబడిపోయా పదినిముషములపాటు. ఆ పూరిగుడిసెముందు. యింకావినబడుతునేవుంది ఆ నీరసమూల్గు మామూలుగా. ఇంక లాభంలేదని, ధైర్యంజేసి రెండడగులు అతి కష్టంమీద ముందుకేసాను. యికయిదే తరుణమని, ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని మరి రెండడగులు ముందుకేసి, ఒక్కసారిగా పూరిగుడిసెలోకి దూరేను....... అక్కడేముంది.?... ...అంతా శూన్యప్రదేశం. కానీ మామూలుగా వినబడే మూల్గు మాత్రం, నే దూరిన మరుక్షణమే ఆగిపోయింది. నాలో అంతవరకూ అణగియున్న భయం అంతా ఒక్కుమ్మడిగా పైకుబికిపోయింది. ''బాబోయ్!'' అన్నాను ఒక్కసారిగా నాకు తెలియకుండానే.

''ఎవరు బాబుమీరు?'' అను మాటలు ఎంతోనీరసంగా నా చెవుల్లో పడ్డాయి. తిరిగి చూచాను. గోడమూలని ఒక ఎముకల గూడు మాత్రం వుంది. దానికి అక్కడక్కడా కొద్ది హరించిపోయిన మాంసకండలున్నాయి. నేనాశ్చర్య పడ్డాను—తరువాత తెప్పరిల్లి, ''నే...ను......'' అనిమాత్రం అనగలిగా. ''మీ...రా! మీ...రు! ధ...నికులా?—అని తిరిగి కర్ణకఠోరమైన శబ్దం. నిజంచెప్పాలి కాబట్టి. ''అవును—'' —అని అన్నాను వెనువెంటనే. ''ఛీ. వెళ్లిపో ముందు! ఇంకావెళ్లవే రాక్షసుడా! నిన్నే వెళ్లు! ఎందుకలా వెఱ్ఱి చూపులు చూస్తావ్? కార్మికులలో జీవశక్తి వున్నంతకాలం, బానిసలను జేసి, వారి రక్తమాంసాలను పీల్చి పిప్పిజేసి మీ యినుపపెట్టెలను నింపుట చాలకా ఇంకా మిగిలివున్న ఈ ఎముకల గూడునుకూడా మీ పొట్టను పెట్టుకొనుటకు వచ్చావ్? దిక్కులేక అల్లాడు దరిద్ర

జీవులకు, ఎన్నడైనా, పొరపాటుననైనా— మా రక్తపు ముద్రలు మీ యినుపపెట్టెలలో నున్న ప్రతీఒక్క నాణెముమీద ఆవరించి థళథళ లాడే ఏఒక్క కాసునైనా వెచ్చించి యిచ్చిన పాపాన పోయారా? మీ చుట్టూ తిండిలేక ఆకలిచే దిక్కులు దద్దరిల్లు నట్లు అభాగ్యులు ఆర్తనాదాలు చేస్తూవుంటే— హంసతూలికా తల్పాలపై పవ్వళిస్తూ, పంచభక్ష్య పరమాన్నాలతో విందు లారగిస్తూన్న, మిమ్ములను ఏమని అనుకోవాలి?

మీరునిజంగా మానవులేనా? లేక, మానవత్వం నశించిపోయిన రాక్షసులా?

.........పో. రాక్షసుడా, యింకాపోవేం.''—అని హూంకరించింది,—ప్రళయ కాలంలోని మేఘ ఘర్జనలాగు, ఆ అస్థిపంజరం.

యింక లాభంలేదని బయటపడ్డా.

''పవిత్రమైన యీకొంపలో మీవంటి అపవిత్రులకు తావులేదు. వెళ్లు నాయనా! వెళ్లు''—అనే ఆపవిత్రవంతుని మాటలు నాహృదయాన్ని చీల్చి వేస్తున్నాయ్. యింక అక్కడ ఒక్క నిముషమైన వుండలేకపోయా. అంతే. వెనక్కుతిరిగికొంప చేరుకొన్నా.


మధుర ధనలక్ష్మి స్టోర్సు వారిచే

తయారుచేయబడిన :

రెడీమేడ్ దుస్తులను
అందరూ ధరించండి.

అమ్మకపు యేజంట్లు
అన్నిచోట్లా కావలెను.

వివరములకు :

**Dhanalakshmi Stores,**
Jadamuni Kovil St., MADURA.

*Sales Depot* :—
**SUNDARAM STORES,**
**MADURA & MADRAS.**


